క్లుప్తంగా

యూట్యూబ్ చానెల్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో అందాల మహారాజా ఫోక్ సాంగ్ శ్రీను రూప 5825 అనే యూట్యూబ్ చానెల్ పోస్టర్‌ను చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర చేతులమీదుగా శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా చానెల్ పనిచేయాలని, ఆ దిశగా కంటెంట్ రూపొందించి చానెల్ ద్వారా ప్రసారం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ క్రియేషన్స్ ప్రతినిధులు, చెల్లయ్య, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్ను చెల్లించకుంటే కనెక్షన్ కట్..



కుళాయి కనెక్షన్ కట్ చేస్తున్న సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి కుళాయిలు వినియోగించుకుంటున్న గృహ యజమానులంతా తక్షణమే పన్ను బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్‌లు తొలగిస్తామని అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు స్పష్టం చేశారు. నగరంలోని చిన్న, సిద్దాబత్తుల వీధుల్లో శుక్రవారం పర్యటించిన ఆయన.. కొన్నాళ్ల పాటు కుళాయి నీటిపన్ను చెల్లించని వారి కనెక్షన్ తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో రోజు విడిచి రోజు తాగునీటి పంపిణీ జరుగుతోందని, దీనికి అనేక వ్యయ, ప్రయాసలు ఉన్నాయన్నారు. ప్రజలు గమనించి తక్షణమే నీటిపన్ను సకాలంలో చెల్లించాలన్నారు.

రుణాలు మంజూరు చేయకపోవడంపై నిలదీత



వెలుగు కార్యాలయం సిబ్బందిని నిలదీస్తున్న మహిళా సంఘాల సభ్యులు

పూసపాటిరేగ: సకాలంలో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడం లేదని మహిళా సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై చింతపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా, దుర్గమ్మ సంఘాల మహిళలంతా స్థానిక వెలుగు కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, సిబ్బందిని నిలదీశారు. సీసీ భాస్కరరావు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రుణాలు అందడం లేదని, ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వెలుగు ఏపీఎం అచ్యుతరావు స్పందిస్తూ రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కథల పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి


విజయనగరం టౌన్: నగరంలో ప్రసిద్ధ కథా రచయిత కీర్తిశేషులు బెహరా వెంకటసుబ్బారావు జ్ఞాపకార్థం కథల పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జి.వి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. బెహరా సత్యనారాయణమూర్తి సౌజన్యంతో విజయనగరం జిల్లా రచయితల సంఘం, విశాఖ సాంస్కృతిక మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి అందిస్తామని, ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన మూడు కథలకు ఒక్కో కథకు రూ.500 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం వారు మాత్రమే అర్హులని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 7702455559ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విజయనగరం అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూ గురజాడ(జీవీ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆకాంక్షించారు. నగరంలోని ఇదే యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఆమె ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల మక్కువ కనబరచాలన్నారు. క్రీడలతో శారీరక ఆరోగ్యం కలగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద..
కరెంట్‌తో జాగ్రత్త!

- పూజా ప్రాంగణాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- అస్తవ్యస్తంగా ఉండే వైరింగ్‌తో ప్రాణాపాయం
- జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



వినాయక మండపం వద్ద చేసిన విద్యుత్ అలంకరణ

విజయనగరం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఊరూరా వెలిసిన మండపాల్లో వినాయకుడిని కొలువుదీర్చి, రోజూ పూజలు చేస్తున్నారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఎంతో సరదాగా జరుపుకునే ఈ పండగ విషాదం కారాదని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా మండపాల వద్ద చేసే విద్యుత్ అలంకరణ కోసం చేసే వైరింగ్ సరిగా ఉండేలా చూసుకోవాలని, అది అస్తవ్యస్తంగా ఉంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లేనని చెబుతున్నారు. ఉత్సవ కమిటీ ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి విపత్తు జరగకుండా చూసుకోవాలని సలహా ఇస్తున్నారు. నిమజ్జనం వరకు ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ప్రస్తుతం వాడవాడలా వినాయక మండపాలు ఉన్న నేపథ్యంలో మండపాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం..

అప్రమత్తంగా ఉండాలి..

వినాయక మండపాల వద్ద ప్రతిఒక్కరూ అప్రమత్తగా ఉండాలి. ముఖ్యంగా కరెంట్‌తో జాగ్రత్తగా ఉండాలి. దర్శనానికి వెళ్లే వారు నిల్చొన్న చోట విద్యుత్ వైర్లు ఏమైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ప్రమాదకరంగా లేని స్థలం వద్ద నిల్చోవడమో, కూర్చోవడమో చేసి పూజలు చేసుకోవాలి. ప్రస్తుతం గణేశుని మండపాలకు ఉచిత కరెంట్ అందజేయడం జరిగింది. –కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- మండపంలో పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్‌బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి, వినియోగించే విద్యుత్ సామర్థ్యాన్ని తట్టుకునేలా వైర్లు ఉపయోగించాలి
- సర్వీసు వైర్లను తీగలకు తగిలేలా ఉంచవద్దు, విద్యుత్ సరఫరా వైర్లు ఉన్న ప్రాంతంలో దీపాలు వెలిగించడం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ప్రమాదకరం
- మండపాల వద్ద నాణ్యమైన ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్(ఈఎల్‌సీబీ), ఎంసీబీలను అమర్చుకోవాలి
- నైపుణ్యం లేని ఎలక్ట్రీషియన్ సాయంతో లేదా సొంతంగా విద్యుత్ సరఫరా ఇచ్చే పనులు చేయవద్దు
- అతుకులతో సర్వీసు, ఇతర వైర్లు లేకుండా చూసుకోవాలి

ఇవి మర్చిపోవద్దు..

- ✔ అధికారికంగా విద్యుత్ సౌకర్యం పొందాలి, నియంత్రికలు, స్తంభాలు, హెచ్‌టీ లైన్లకు సమీపంలో మండపాలు ఏర్పాటు చేయవద్దు
- ✔ మల్టీ ప్లగింగ్, ఓవర్ లోడ్‌ను నివారించాలి
- ✔ విద్యుత్ అలంకరణకు ఎస్ఈడీ బల్బులే వాడాలి, మండపం వద్ద డిస్ట్రిబ్యూషన్ బోర్డు ఉంటే ప్రమాదం జరిగితే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది
- ✔ విద్యుత్ ఉపకరణాలు వర్షంలో తడవకుండా చూసుకోవాలి, అలాగే వాటిని భక్తులకు దూరంగా ఉంచాలి, తడిచేతులతో ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తాకవద్దు, తీగలకు దగ్గరగా ప్లాస్టిక్ అలంకరణలు ఉంచొద్దు

నిమజ్జనంలో ఇలా చేయండి..

- ☛ నిమజ్జనం సమయంలో ఎత్తైన విగ్రహాలను తీసుకెళ్లేటప్పుడు రోడ్లు మీది విద్యుత్ తీగలను తాకకుండా చూసుకోవాలి,
- ☛ దారిలో విగ్రహాలను తాకే ఎత్తులోని విద్యుత్ వైర్లను కర్ర సాయంతో ఎత్తాలి
- ☛ విగ్రహం తరలించే వాహనం డ్రైవరు మద్యం తాగకుండా ఉండేలా చూడాలి, ఒకరిని ఏకంగా పర్యవేక్షణ కోసం నియమించాలి
- ☛ విద్యుత్, కేబుల్ నెట్‌వర్క్ తీగలను పరిశీలిస్తూ జాగ్రత్తగా ప్రతిమలు తరలించాలి
- ☛ వాహనాలను విద్యుత్ తీగల కింద నిలిపి విగ్రహాలను ఎక్కించొద్దు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు విజయలక్ష్మి, శ్రావణి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అధికారంలోకి వచ్చి 14 నెలల కాలం దాటినా పథకాలన్నీ పూర్తిగా అమలు చేయడం లేదని నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విమర్శించారు. నగరంలోని 27వ డివిజన్, జొన్నగుడ్డిలో కార్పొరేటర్ దుప్పాడ సునీత ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారు..ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ఒక్కో పథకం ఒక్కొక్కరికి ఒక్కోలా వర్తించిందని ఆరోపించారు. తల్లికి వందనం పథకం డబ్బులైతే ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు పడిందని ఉదహరించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారని, అవెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం గాలికొదిలేసి, రాజకీయ కక్షలు, కుట్రపూరిత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం తెరతీసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ, కూటమి నాయకుల అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు ఉషా, రాణి, అనూష, జ్యోతి, నందిని, కృష్ణవేణి, సుజాత, ప్రశాంతి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) గొడౌన్లలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గొడౌన్ గదులకు వేసిన తాళాలు, సీళ్లు పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో గొడౌన్‌ల భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. ఆయన వెంట డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



గొడౌన్ వద్ద అధికారులతో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

తెలుగు భాష పరిరక్షణకు పాటుపడదాం



విజయనగరం: విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పురస్కారం అందుకుంటున్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



డెంకాడ: గొల్లపేట ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయ సిబ్బంది



విజయనగరం టౌన్: సాంఘిక సంక్షేమ కళాశాల బాలిక వసతిగృహంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వసతిగృహం సంక్షేమ అధికారిణి రాధామణి



నెల్లిమర్ల రూరల్: పారసాంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష గొప్పదనం చాటుతూ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



విజయనగరం టౌన్: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జానపద కళాపీఠం ప్రతినిధులు

తెలుగు మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు వారి రంగాల్లో చేసిన కృషిని వక్తలు కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణకు గిడుగు రామ్మూర్తి విశేషంగా కృషి చేశారని, ఆయన ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తూ మన మాతృభాష అయిన తెలుగు పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం ఆయా దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.
–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం అర్బన్: విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఆచార్యుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రేఖ

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ సరోజిని



సమావేశంలో పాల్గొన్న నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: ప్రజాసమస్యలపై దృష్టిసారించాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని సూచించారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ పరిధిలోని పలు ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై నిలదీశారు. నగరపంచాయతీలో వీధిదీపాల నిర్వహణ, మురుగునీటి కాలువల్లో పూడికతీతలు వంటి విషయాల్లో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం మున్సిపాలిటీకి అందజేసిన కొత్త వాహనాల టైర్లు, కొన్ని పార్టులను సిబ్బందిలో కొంతమంది విప్పేసి, అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కొత్తగా 400 వీధిలైట్లు కొనుగోలు చేశారని, అయితే వాటిని ఎక్కడ బిగించారో తెలపాలని డిమాండ్ చేశారు. జరజాపుపేట ఒకటో వార్డులోని డ్రైనేజి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అలాగే టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించడానికి ముందుకు రావడం లేదన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమావేశం దృష్టికి వచ్చి ప్రతి సమస్య పరిష్కారం కావాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ టి.జయరాం, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని బాబామెట్టలో ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది మహిళలను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.14,016 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం..

విజయనగరం: నగరంలో వీధి దీపాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, కొత్త దీపాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని బాబామెట్ట, పాల్‌నగర్, ప్రశాంతినగర్, ఆనందపురం కాలనీ, బుంగ వీధి, జమ్ము, బొగ్గులదెబ్బ తదితర ప్రాంతాల్లోని వీధి దీపాల మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. కొత్త దీపాలు అవసరమైన చోట ఏర్పాటు చేస్తామన్నారు.

వ్యవసాయంలో యంత్రాల వినియోగంతో పెట్టుబడి ఆదా



పురుగుమందు పిచికారీ చేసే డ్రోన్ అందిస్తున్న అధికారులు

వంగర: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు వినియోగిస్తే రైతులకు పెట్టుబడి ఆదా అవుతుందని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామంలో ఓం గణపతి రైతు మిత్ర సంఘానికి డ్రాగో కంపెనీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సంయుక్తంగా రుణం ద్వారా సమకూర్చిన పురుగుమందు పిచికారీ డ్రోన్‌ను ఏఓ శుక్రవారం అందజేసి మాట్లాడారు. డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా పైరుపై సమానంగా మందు పడుతుందని, ఎకరా పంటకు ఏడు నిమిషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు. దీంతో సమయం కూడా ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ తదితరులు ఉన్నారు.

అవయవదానానికి అంగీకారం



అవయవదానం అంగీకార పత్రం అందజేస్తున్న దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాదరావు, లక్ష్మీ దంపతులు తమ కుమార్తె జేస్మితశ్రీ పుట్టిన రోజు శుక్రవారం కాగా ఇదే రోజున తమ కళ్లతో పాటు మిగతా అవయవాల దానానికి ముందుకువచ్చారు. ఈ మేరకు వారు అంగీకారపత్రాన్ని బొడ్డేపల్లి రామకృష్ణారావుకు అందజేసి, తమ మంచి మనసు చాటుకున్నారు. అంతకుముందు స్థానిక జిల్లా రెడ్‌క్రాస్ నైట్ షెల్టర్‌లోని వృద్ధులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేసి దానం చేశారు. ఆ తర్వాత ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ ఇలానే సమాజ సేవకు ముందుకురావాలని ఆకాంక్షించారు.

నష్టపరిహారం చెల్లించాకే వేలం వేయాలి



ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన సర్ప్లస్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే ఆ భూముల్లోని చెట్లకు వేలంపాట నిర్వహించాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. వేలం ప్రక్రియ నిర్వహణకు గ్రామానికి వచ్చిన ప్రాజెక్ట్ అధికారులకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ కోసం సేకరించిన 15.44 ఎకరాల భూమికి సంబంధించి, నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని మొదట్లో డిమాండ్ చేశామని, తర్వాత తమ డిమాండ్ విరమించుకుని ప్రభుత్వం ఇచ్చే డబ్బులు తీసుకునేందుకు అంగీకారం తెలిపామన్నారు. అయినప్పటికీ ఆ నష్టపరిహారం సొమ్మును తమకు తెలియకుండానే కోర్టులో డిపాజిట్ చేసి, నోటీసులు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా డబ్బులు చెల్లించకుండా తమ భూముల్లో ఉన్న చెట్లు, మొక్కలకు వేలం వేసేందుకు నోటీసులు ఇచ్చారన్నారు. వేలం ప్రక్రియ జరిగితే రావాల్సిన నష్టపరిహారం అందదని, ఈ విషయంలో కోర్టును ఆశ్రయిస్తామన్నారు. న్యాయపరమైన డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని వేలంపాట ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత రైతులు సారిపల్లి నాగరాజు, ఆల్తి కృష్ణమ్మ, సారిపల్లి గురునాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

రాజాం సిటీ: పట్టణానికి చెందిన యండమూరి శ్రీనివాసరావు(40) చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి..మృతుని తండ్రి మాధవరావు అనారోగ్యానికి గురై సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని విశాఖపట్నం గాజువాకలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు తెలుసుకుని ఈ నెల 25న చీపురుపల్లి వరకు ట్రైన్‌లో వచ్చాడు. అక్కడ నుంచి ఆటోలో వస్తూ బొద్దాం సమీపంలో డ్రైవరు షడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ పేర్కొన్నారు. మృతుని భార్య యండమూరి రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.